# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-09-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో మూడు రోజుల పాటు జరిగే సెమికాన్ ఇండియా 2024 ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభిస్తారు.**
2. **బుడమేరులో ఆక్రమణలను తొలగించేందుకు 'ఆపరేషన్ బుడమేరు' ను చేపడతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లో వరద పరిస్థితిని పరిశీలించేందుకు కేంద్ర నిపుణుల బృందం ఇరు రాష్ట్రాల్లో పర్యటిస్తుంది.**
4. **కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల నిధుల వాటాను 50శాతానికి పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆర్థిక సంఘాన్ని కోరారు.**
5. **విజయవాడ ప్రకాశం బ్యారేజీకి కొట్టుకొచ్చిన పడవలను వెలికి తీసే ప్రక్రియ కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో మూడు రోజుల పాటు జరిగే సెమికాన్ ఇండియా 2024 ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ప్రారంభిస్తారు. "సెమీకండక్టర్ భవిష్యత్తును రూపొందించడం" అనే ఇతివృత్తంతో ఈ సమావేశాలను ఈ రోజు నుంచి సెప్టెంబర్ 13 వరకు నిర్వహించనున్నారు. సెమీకండక్టర్ రూపకల్పన, తయారీకి భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సెమికాన్ ఇండియా 2024 దోహదపడనుంది.

ఇలా ఉండగా ఢిల్లీలో నూతంగా ఏర్పాటైన అనుసంధాన్ జాతీయ పరిశోధన ఫౌండేషన్ తొలి పాలకమండలి సమావేశానికి ప్రధాన మంత్రి నిన్న అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ అంతర్జాతీయ సమస్యలకు స్థానిక పరిష్కారాలు కనుగొనాలని పేర్కొన్నారు. పరిశోధన,ఆవిష్కరణల కోసం వనరుల వినియోగాన్ని శాస్త్రీయంగా పర్యవేక్షించాల్సిన అవసరముందని అన్నారు. పరిశోధన అభివృద్ధిలో ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ఒక డాష్ బోర్డ్ రూపొందించాలని ప్రతి రంగంలో నిపుణుల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

--------------------------

బుడమేరులో ఆక్రమణలను తొలగించేందుకు 'ఆపరేషన్ బుడమేరు' ను చేపడతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి

నిన్న పర్యటించి బుడమేరు గండ్లు పూడ్చిన ప్రదేశాలను పరిశీలించారు. గండ్లు పడిన తీరు, వరద ప్రవాహం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నష్టాన్ని అంచనా వేసి ప్రతీ ఒక్కరికీ పరిహారాన్ని అందించే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. వరదల కారణంగా పాడైపోయిన గృహోపకరణాలను మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 35 సెకన్లు

ఇలా వుండగా ముఖ్యమంత్రి ఈరోజు ఏలూరు, కాకినాడ జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వరద పరిస్థితిని పరిశీలించేందుకు కేంద్ర నిపుణుల బృందం ఈ రోజు, రేపు రాష్ట్రంలో పర్యటిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తెలిపారు. హోం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ నేతృత్వంలోని బృందంలో జాతీయ రహదారులశాఖ చీఫ్ ఇంజినీర్ రాకేశ్ కుమార్, ఆర్థికశాఖ సలహాదారు ఆర్‌బీ కౌల్, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ డిప్యూటీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్, జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం శాస్త్రవేత్త ఎస్‌వీఎస్‌పీ శర్మ తదితరులు ఉన్నారని తెలిపారు. పర్యటనలో భాగంగా ఈరోజు తాడేపల్లిలోని విపత్తులశాఖ కార్యాలయంలో కేంద్రబృందం సమావేశం కానుందని చెప్పారు. అనంతరం కృష్ణా, బాపట్ల జిల్లాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తారని వివరించారు. అలాగే రేపు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కేంద్ర నిపుణుల బృందం పర్యటించనుందని ఆర్ పి సిసోడియా పేర్కొన్నారు.

-------------------------

తెలంగాణలో భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు ఈ రోజు కేంద్ర బృందం రాష్ట్రానికి రానుంది. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ బృందానికి కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ నేతృత్వం వహించనున్నారు. ఈ బృందంలో కేపీ సింగ్‌తో పాటు.. కేంద్ర ఆర్థిక, వ్యవసాయ, రహదారులు, గ్రామీణాభివృద్ధి, శాఖలకు చెందిన అధికారులు పర్యటిస్తారు. ఈ ఉదయం కేంద్ర బృందం తెలంగాణలో తీవ్ర వరద నష్టం సంభవించిన ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఇతర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, వరద బాధితులతో చర్చించి నష్టాన్ని అంచనా వేయనుంది. పర్యటనలో భాగంగా కేంద్ర బృందం తెలంగాణలో వరద నష్టం, పరిస్థితులను అంచనా వేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది.

-------------------------

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల నిధుల వాటాను 50శాతానికి పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ఆర్థిక సంఘాన్ని కోరారు. నిన్న హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్థిక సంఘానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్'గా పిలుస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి 6.85లక్షల కోట్ల రూపాయల రుణాలు ఉన్నాయని తెలిపారు. ఆదాయంలో అధికంగా రుణాల చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఉందని, రుణ సమస్య పరిష్కారానికి తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని, అదనపు ఆర్థిక సాయం చేయాలని కోరారు. తెలంగాణను ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక

వ్యవస్థగా మార్చడంలో తమ వంతు బాధ్యత నెరవేరుస్తాం అని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

హైదరాబాద్ లోని హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జన వేడుకలపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 2021లో రూపొందించిన మార్గదర్శకాలనే పాటించాలని సూచించింది. మట్టి, పర్యావరణ హిత విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేయాలని హైకోర్టు తెలిపింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను హైదరాబాద్ మహానగర నగరపాలక సంస్థ – జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కృత్రిమ నీటికుంటలోనే నిమజ్జనం చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలపై పోలీసులు ఆంక్షలు విధించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వినాయక నిమజ్జనాలను అనుమతించడం లేదని ట్యాంక్‌బండ్‌పై గోడ పత్రికలను ఏర్పాటు చేశారు. ప్రతి 100 మీటర్లకు ఒక గోడ పత్రికని ఏర్పాటు చేశామని భక్తులు గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

---------------------------

విజయవాడ ప్రకాశం బ్యారేజీకి కొట్టుకొచ్చిన పడవలను వెలికి తీసే ప్రక్రియ కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గతరాత్రి విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద పడవల వెలికితీత పనులను మంత్రి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్.. 26 సెకన్లు

---------------------------

ఆకాశవాణి విశ్రాంత సీనియర్ అనౌన్సర్, రచయిత, సంగీతదర్శకులు ఈమని కృష్ణశాస్త్రి నిన్న విజయవాడలో మృతి చెందారు. 1990 సం॥లో కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రంలో జూనియర్ అనౌన్సర్‌గా ఉద్యోగంలో ప్రవేశించి,ఆ తర్వాత విశాఖ పట్నం, హైదరాబాద్, విజయవాడ ఆకాశవాణి కేంద్రాలలో అనౌన్సర్ గా విధులు నిర్వర్తించారు. ఆయన రూపొందించిన 'శివతాండవం,సుప్తజగతి, మహార్ణవం వంటి సంగీత రూపకాలకు ఆకాశవాణి వార్షిక జాతీయ బహుమతులను పొందారు.

తెలుగు చలనచిత్ర సంగీత దర్శకులపై కృష్ణశాస్త్రి రూపొందించిన 'సినీ వినీలాకాశంలో 'అనే ధారావాహిక శ్రోతలను విశేషంగా అలరించింది. గాయకులుగా, సంగీత దర్శకులుగా ఆకాశవాణికి సేవలందించిన కృష్ణ శాస్త్రి మృతి పట్ల విజయవాడ ఆకాశవాణి కార్యాలయ అధిపతి ఎమ్.సోమేశ్వరరావు, కార్యక్రమ విభాగాధిపతి బి.వేంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.

---------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిన్న ఢిల్లీలో సమావేశమైయ్యారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని వరద పరిస్థితుల్ని ఆమెకు వివరించి, వరద నష్టంపై మధ్యంతర నివేదికను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్రబృందాలు పర్యటిస్తున్నాయని తెలిపారు. వరదలపై మరో నివేదికను వారంలోపు అందజేస్తామని చెప్పారు. సమావేశం అనంతరం మంత్రి పాత్రికేయులుతో మాట్లాడుతూ, రాష్ట్రంలో వర్షాలు, వరదల పరిస్థితుల గురించి కేంద్రమంత్రికి వివరించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానులకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు.

======================